క్లుప్తంగా

వృద్ధుడికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



వృద్ధుడిని షెల్టర్‌కు తీసుకొచ్చిన మమత

విశాఖ విద్య: వేపగుంట అప్పన్నస్వామి ఆలయం వద్ద నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. వృద్ధుడి విషయం తెలుసుకున్న జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత సోమవారం అక్కడికి చేరుకొని వివరాలు సేకరించింది. పెందుర్తి సీఐ సమక్షంలో కానిస్టేబుల్ హుస్సేన్ సహకారంతో ఆ వృద్ధుడిని బుచ్చిరాజుపాలెం షెల్టర్‌కు తీసుకొచ్చారు. కుమారుడే అతన్ని తీసుకొచ్చి గుడి వద్ద వదిలి వెళ్లి పోయినట్టు స్థానికులు చెప్పారన్నారు. మతిస్థిమితం లేనందున, అతని వివరాలు పూర్తిగా తెలియలేదని మమత తెలిపారు.

స్పందనకు ఆరు వినతులు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం ఆరు వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ కె.హేమవతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. జోన్–8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కమాండర్ ఆశుతోష్

సింథియా: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలోని క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి ఆంకాలజీ డిపార్ట్‌మెంట్‌తో కలిసి ఐఎన్‌ఎస్ ఎక్సిలాలో సోమవారం నేవీ అధికారులు క్లోజ్ ద కేర్ గాయప్ అనే థీమ్‌తో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమాండర్ అసుతోష్ భట్ ముఖ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో సుమారు 400 మంది పైగా నేవీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సెకండియర్ పరీక్ష వాయిదా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 7న జరగాల్సిన ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం మొదటి సెమిస్టర్ బీటెక్, బీఈ, బీఆర్క్ పరీక్షను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 19న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అధికారి అనంత్ పర్వార్ సస్పెన్షన్

ఉక్కునగరం: విభాగాధిపతిను దుర్భాషలాడిన స్టీల్‌ప్లాంట్ ఎల్‌అండ్‌డీసీ మేనేజర్ అనంత్ పర్వార్‌ను ఉక్కు యాజమాన్యం సస్పెండ్ చేసింది. తక్కువ మార్కులు వేయడం వల్ల గ్రేడింగ్ తగ్గిందన్న కోపంతో పర్వార్ అదే విభాగం జీఎం ఎస్.భానును ఫోన్‌లో దుర్భాషలాడి ఆమెపై దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరిట దూషించారు. ఈ మేరకు జీఎం భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు పర్వార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీస్ కమిషనర్ రవిశంకర్ సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. అదే విధంగా పర్వార్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె ఉక్కు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై సత్వరం స్పందించాలంటూ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి చేశారు. ఈ మేరకు యాజమాన్యం పర్వార్‌పై చర్యలు తీసుకుంది.

ఫలించిన నిరీక్షణ

- వుడా కాలనీలో రూ. 67 లక్షలతో సామాజిక భవనం నిర్మాణం
- రూ.50 లక్షలతో వుడా కాలనీ చుట్టుపక్కల బీటీ రోడ్లు
- కాలనీవాసుల హర్షం



వుడా కాలనీలో రోడ్డు పరిస్థితి



వుడా కాలనీలో ఇటీవల వేసిన బీటీ రోడ్డు



గుల్లలపాలెం వుడా కాలనీలో నిర్మిస్తున్న సామాజిక భవనం

మల్కాపురం: వుడా కాలనీవాసుల ఏళ్లనాటి కల నెరవేరనుంది. కాలనీవాసుల సమావేశాల నిర్వహణకు, శుభకార్యాల కోసం సామాజిక భవనం నిర్మించాలని చేస్తున్న విజ్ఞప్తులకు వైఎస్సార్‌సీపీ పాలనలో పరిష్కారం దొరికింది. కోటి రూపాయల విలువైన ప్రభుత్వ స్థలంలో సుమారు రూ.67 లక్షలతో అధునాతన వసతులతో భవన నిర్మాణం ప్రారంభమైంది. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు మరో రెండు నెలల్లో పూర్తి చేసి, భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలో సుమారు 250 కుటుంబాలు ఉన్నాయి. కాలనీ వాసులు తమ కాలనీకి సంబంధించిన సమావేశాలు ఏమైనా నిర్వహించాలంటే సరైన వేదిక లేదు. ఏదైనా చిన్న శుభకార్యం చేసుకోవాలి అన్నా సర్వీస్ రోడ్డులోనే, వాకింగ్ పార్కులోనో .. లేదంటే ఏదైనా ప్రైవేట్ ఫంక్షన్ హాల్ గానీ చూసుకోవాల్సిందే. ఈ సమస్య పరిష్కారమయ్యేలా ఓ సామాజిక భవనం నిర్మించాలంటూ కాలనీవాసులు గత పాలకులకు వినతులు సమర్పించారు. కానీ, ఫలితం లేకపోయింది.

'గడప గడపకు మన ప్రభుత్వం'లో పరిష్కారం

ఈ నేపథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్‌కు, కార్పొరేటర్ పి.వి.సురేష్‌కు కాలనీవాసులు సమస్య తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆనంద్‌కుమార్ జీవీఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.67 లక్షలతో భవనం నిర్మాణానికి చొరవ చూపారు. అంతే కాదు, వుడా కాలనీ పరిధిలోని పలు సర్వీస్ మార్గాల్లో రూ.50 లక్షలతో బీటీ రోడ్లు వేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు స్థానికులు సమస్యను నా దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి, భవన నిర్మాణం ప్రారంభమయ్యేలా చేశాం. చుట్టుపక్కల రోడ్లు అభివృద్ధి చేశాం. మా పార్టీకి ఓటు వేసినా.. లేకున్నా మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం.

– ఆదారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

వారి చొరవ వల్లే సాధ్యమైంది



మా కాలనీలో సామాజిక భవనం లేక సమావేశాలు, శుభకార్యాల నిర్వహణకు ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. రోడ్డుపై అంటే అందరికీ కష్టమయ్యేది. ఫంక్షన్ హాల్లో అంటే అందరికీ సాధ్యం కాదు కదా. ఎట్టకేలకు ఆనంద్‌కుమార్, పీవీ సురేష్‌ల చొరవతో సమస్య పరిష్కారమైంది. భవన నిర్మాణం సాకారమవుతోంది.

– చైతన్యకుమార్, ఉడా కాలనీ

ఎంతో అభివృద్ధి



ఇండస్ట్రియల్ ఏరియాలో ఎంతో ప్రశాంత వాతావరణం గల వుడా కాలనీలో గతంలో ఎన్నో సమస్యలుండేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎంతో అభివృద్ధి జరిగింది. రూ.60 లక్షలతో చిల్డ్రన్ పార్కు, రూ.కోటితో వివిధ ప్రాంతాల్లో బీటీ రోడ్లు, రూ.67 లక్షలతో సామాజిక భవనం, మరో రూ.50 లక్షలతో వుడా కాలనీ పరిసర ప్రాంతాల్లో బీటీ రోడ్లు వేశారు.

– పి.వి.సురేష్, కార్పొరేటర్

ప్రజలు సంతోషంగా ఉన్నారు



వుడాకాలనీతో పాటు 60వ వార్డు పరిసర ప్రాంతాల్లో ఇటీవల జరుగుతున్న అభివృద్ధి చూసి ఇక్కడివారు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఆనంద్‌కుమార్, సురేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. వారి స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది.

– ఆదారి హరీష్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులకు వినతులను అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ చెప్పారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాయంత్రం సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జెడ్సీ కృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, వాటర్ వర్క్స్ ఈఈ సూరిశెట్టి శేఖర్, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

సందడిగా కళా సేవా పీఠం వనసమారాధన



వనభోజనంలో పాల్గొన్న గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళాసేవా పీఠం సేవలు సృజనాత్మకంగా నిర్వహిస్తుందని కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు అన్నారు. కళాపీఠం 8వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సింహాచలంలో వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాసేవా పీఠం నేతృత్వంలో కళల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.ప్రాచీన కళలు, కళాకారులకు సత్కారాలు చేస్తూ ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తు తరాలకు ఈ కళలపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు రూపొందిస్తున్నామని తెలిపారు. కళాపీఠానికి శాశ్వత భవనం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గోగొరకల రామదాసు, ప్రధాన కార్యదర్శి డీఎస్ నాయుడు, సభ్యులు టి. రామారావు, కంపర కనకరాజు, మిద్దె అప్పారావు, గులిమి అప్పారావు, వెంకట్, భాస్కర్, చందు సుబ్బారావు పాల్గొన్నారు.

జీవీఎంసీ అధికారులకు సత్కారం



ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఎస్ఎస్ రమణను సత్కరిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ పరిధిలో 91వ వార్డు సచ్ఛతలో భాగంగా ఎకో సేవా పురస్కారం అందుకోవడంలో కీలక భూమిక పోషించిన అధికారులను సోమవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అభినందించారు. ఈ మేరకు జోన్–8 ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, ఎస్ఎస్ వెంకటరమణతో పాటు శానిటరీ సిబ్బంది గోపాలపట్నంలో ఆయన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని భాస్కరరావు సత్కరించి అభినందించారు.

ప్రజలకు కూడా పారిశుధ్య నిర్వహణకు సహకరించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ సంచుల వినియోగానికి చెక్ పెట్టాలని కోరారు.కాల్వల్లో చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చిన పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్త అందించాలన్నారు. 91వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు, సూపర్‌వైజర్లు, మేస్త్రీలు, కార్మికులను కూడా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, దేరెడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి జగనన్న భరోసా



ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న పుర్రె సురేష్‌యాదవ్



ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

మల్కాపురం: పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ అన్నారు. 59వ వార్డు నక్కవానిపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అర్హులైన వారికి ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా పైసా ఖర్చు లేకుండా ఉచితం వైద్యం పొందవచ్చునన్నారు.

40వ వార్డులో..

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో సోమవారం నూతన లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిరుపేదలకు కూడా కార్పొరేట్ వైద్యం అందాలనే ఉద్దేశంతో కుటుంబానికి రూ.2 లక్షల పరిమితితో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేశారన్నారు. అటువంటి మహోన్నతమైన పథకాన్ని గత టీడీపీ ప్రభుత్వం నీరుకార్చిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ కార్డు పరిమితిని రూ.5 లక్షలకు పెంచారన్నారు. తాజాగా మరికొన్ని వ్యాధులకు సంబంధించిన చికిత్సలను సైతం ఆరోగ్యశ్రీలో చేర్చడంతో పాటు పరిధిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆరోగ్య ప్రదాతగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఏడుగురి అరెస్ట్, రూ.25 వేల నగదు స్వాధీనం

పెందుర్తి: వేపగుంట సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో జరుగుతున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.25,122 నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి...వేపగుంట సమీపంలోని ఓ తోటలో పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందిందింది. దీనిపై సీపీ రవిశంకర్, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ వెంకటరావు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద ఉన్న నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని పెందుర్తి పోలీసులకు అప్పగించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం కండి

వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశంలో నేతలు



61వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: సార్వత్రిక ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లకు ఆ పార్టీ నాయకులు సూచించారు. ప్రతి బూత్‌లో వైఎస్సార్‌సీపీ అధిక ఓట్లు పోలయ్యేలా ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. జీవీఎంసీ 61వ వార్డులో కార్పొరేటర్ కొణతాల సుధ, జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెంలో కార్పొరేటర్ పూర్ణశ్రీయాదవ్, వైఎస్సార్‌టీయూ నాయకుడు సురేష్ యాదవ్ ఆయా వార్డు ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆదారి ఆనంద్‌కుమార్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పేదల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు,ఆ పథకాల ద్వారా నిరుపేదలు పొందిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు గొంతిన నాగేశ్వరరావు,రేవళ్ల సత్యనారాయణ,వార్డు పార్టీ అధ్యక్షుడు జీ.వి.ఎ స.ఎస్.రాజు (కేబుల్ వాసు),జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం,నాయకులు మధుబాబు, సోనూ, పెంటారావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ డాక్టర్ విధానం భేష్

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు డిఫెన్స్ అధికారుల కితాబు



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డిఫెన్స్ అధికారులు బృందం

ఆనందపురం : కుటుంబ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉందని డిఫెన్స్ అధికారులు కితాబు ఇచ్చారు. ఎన్‌డీసీ సీనియర్ డైరెక్టర్ ఎం.కె. ఏవీఎస్ ఆధ్వర్యంలో జాతీయ రక్షణశాఖ కళాశాల నుంచి 15 మంది డిఫెన్స్ అధికారులు మండలంలోని వేములవలసలో ఉన్న వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (ఆయుష్మాన్ భారత్)ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ డాక్టర్ విధానం వలన ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇంటికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు తనిఖీలు, మందులు పంపిణీ, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షలు వరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు, వైద్యసేవలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు పథకాలు అమలు తీరుని పరిశీలిస్తే అవగతమవుతోందని చెప్పారు. ఎబ్బందితో సమావేశమై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వైద్య సేవలు సంపూర్ణంగా అందించడానికి సిబ్బందితో పాటు మందులు కూడా అందుబాటులో ఉన్నాయని సిబ్బంది, డిఫెన్స్ అధికారులకు వివరించారు.

నైపుణ్యం పెంపుపై విద్యార్థులు దృష్టి పెట్టాలి

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఆంధ్రా బయో సమ్మిట్ ప్రారంభం



సదస్సును ప్రారంభించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యం పెంపు దృష్టి పెట్టాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ, టీ కాబ్స్–ఈ సంయుక్త నిర్వహణలో మూడు రోజుల రాష్ట్ర స్థాయి జీవ సదస్సు(ది ఆంధ్రా బయో సమ్మిట్)ను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులను విశ్వనరులుగా తీర్చిదిద్దడంలో ఏయూ ముందంజలో ఉందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్య ప్రత్యేకతను చాటాలన్నారు. ప్రయోగాత్మక, ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌శ్రీనివాసరావు, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య లక్ష్మి పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ఆచార్య సత్యనారాయణరెడ్డి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సోమవారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ(సీఎస్‌టీటీ) న్యూఢిల్లీ, కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో 'భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం ప్రాముఖ్యత' అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ముఖ్య అతిథులు ఆంధ్ర విశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధ్యక్షుడు ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, సీఎస్‌టీటీ చైర్మన్ ఆచార్య గిరీష్ నాథ్ ఝూ, ప్రోగ్రాం అధికారి సిహెచ్.వినోదినీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఇంటర్‌నెట్ ద్వారా సాంకేతిక పదజాల నిర్మాణంలో సీఎస్‌టీటీ వారి నవ్య శోధనలు, నూతన పోకడలను వివరించారు. సాంకేతిక పదజాల వినియోగంలో ప్రాంతీయ భాషల ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ తెలుగు, హిందీ భాషల్లో సీఎస్‌టీటీ సంస్థ తమ కళాశాలలో సదస్సు నిర్వహించడం గర్వకారణమని కో–ఆర్డినేటర్ ద్వితీయ భాషా విభాగాధ్యక్షురాలు పి.కె.జయలక్ష్మి పేర్కొన్నారు.

ఏయూ ఆచార్యుడికి రెండు పేటెంట్‌లు



ఈశ్వర్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆచార్యుడు కె.ఈశ్వర్‌కుమార్‌కు రెండు భారతీయ పేటెంట్‌లు లభించాయి. తిరుపతి నుంచి విశాఖపట్నం మధ్యలో ఉన్న తూర్పు కనుమల్లోని ఔషధ మొక్కలపై చేసిన పరిశోధనకు ఈశ్వరకుమార్‌కు, పరిశోధకులకు ఈ పేటెంట్‌లు దక్కాయి. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందిచారు. ఏయూ ఐపీఆర్ కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 125 పేటెంట్ దరఖాస్తులు చేశామని, ఇప్పటి వరకు 6 పేటెంట్‌లు సాధించామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

29లోగా కార్మిక శాఖ నుంచి లైసెన్స్ పొందాలి

సీతంపేట: జిల్లాలోని దుకాణదారులు, వాణిజ్య వ్యాపార సంస్థలు తప్పనిసరిగా కార్మికశాఖ నుంచి లైసెన్స్ పొందాలని సహాయ కార్మికశాఖ కమిషనర్ సర్కిల్–2 బుద్దా మునిస్వామి పేర్కొన్నారు. దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటార్ రవాణా వాహన యజమానులు, అంతరరాష్ట్ర వలస కార్మికులను వినియోగించే వారు కార్మిక చట్టం ప్రకారం విధిగా ఈ నెల 29లోగా రిజిస్ట్రేషన్ చేసి సర్టిఫికెట్ పొందాలన్నారు. కార్మిక చట్టాలన్నీ కలిపి ఒకే రిజిస్ట్రేషన్ పత్రం పొందే అవకాశం ఉందని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ పొందిన వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. గడువులోగా రిజిస్ట్రేషన్ పత్రం పొందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఐఎన్‌ఎస్ డేగాలో సీ క్యాడెట్ కార్ప్స్



చేతక్ హెలికాప్టర్ గురించి వివరిస్తున్న ఐఎన్‌ఎస్‌డేగా అధికారి

గోపాలపట్నం: ఐఎన్ఎస్ డేగాలో 30 మంది సీ క్యాడెట్ కార్ప్స్ సందర్శించారు. ఇక్కడి పలు విభాగాల పని తీరును పరిశీలించారు. చేతక్ హెలికాప్టర్ ఏవిధంగా పని చేస్తుంది. ఏవియేషన్‌లో నిర్వహించే విధులను వీరికి వివరించారు. ఇక్కడి సాహసోపేతమైన, నైపుణ్యాలు, సృజనాత్మకత ఆవిష్కరణలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్‌డేగా అధికారులు, నేవీ అధికారులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

పెదగంట్యాడ: విద్యార్థుల ప్రగతికి ఇంటారాక్టివ్ కమ్యూనికేషన్ టూల్స్ (ఐసీటీ) ఎంతో ఉపయోగపడతాయని జిల్లా ఉప విద్యా శాఖాధికారి గౌరీ శంకర్ అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయులకు నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గౌరీ శంకర్ మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుని, రాణించేలా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా గణిత ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. పీహెచ్‌ఈటీ సిమ్యులేషన్స్, ఓ ల్యాబ్స్, రోబో కంపాస్, ఇంటరాక్టివ్ వీడియో ప్రిపరేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్, క్విజ్ పేపర్ మోడ్, జియో జీబ్రా గ్రిడ్స్ తదితర ఇంటారాక్టివ్ కమ్యూనికేషన్ టూల్స్ గురించి వివరించారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక విద్యా విధానంలో ఐసీటీ టూల్స్ ద్వారా ఉపాధ్యాయుల పని తీరు కూడా మరింత మెరుగు పడుతుందన్నారు. ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ, ఈశ్వరరెడ్డి శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కోర్సు డైరెక్టర్‌గా హెచ్ఎం శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లుగా సూర్యకిరణ్, సురేష్, బాబ్జీ వ్యవహరించారు.